క్లుప్తంగా

పెంచలకోనలో మోస్తరు వర్షం



పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదివారం సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సాయంత్రం వర్షం కురవడంతో కొంతమేర ఉపశమనం పొందారు.

ఆలయాల్లో సంప్రోక్షణ

శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ఉదయం శుద్ధి, సంప్రోక్షణ,నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించినట్లు అధికారులు తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయాలను మూసివేసి ఆదివారం భక్తులను దర్శనానికి అనుమతించినట్లు వివరించారు.

అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక నిఘా

- 5 లారీలు స్వాధీనం
- జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్



స్వాధీనం చేసుకున్న లారీ

సైదాపురం: ఖనిజ సంపదను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస కుమార్ వెల్లడించారు. ఆయన ఆదివారం సైదాపురంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమాచారం అందిన వెంటనే తనిఖీలు చేపట్టి వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే అధిక టన్నేజీతో చెన్నైకు ఖనిజాన్ని తరలిస్తున్న ఐదు లారీలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఆయన వెంట విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ తదితరులున్నారు.

ట్రాక్టర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

సైదాపురం: గులించెర్ల అటవీ ప్రాంతం నుంచి తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తెలిపారు. అడవి నుంచి ట్రాక్టర్ ద్వారా నిత్యం తెల్లరాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో గులించెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత ట్రాక్టర్‌ను స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఖనిజాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది అమీనయ్య, రవిశేఖర్, విజయ్‌కుమార్, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వరదయ్యపాళెం విద్యార్థులు


ప్రవల్లిక


మోహిత్‌రెడ్డి


యాషిక

వరదయ్యపాళెం: రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ బందిల కుమార్ తెలిపారు. అండర్–17 కేటగిరీలో పదో తరగతి విద్యార్థులు ప్రవల్లిక (సాఫ్ట్‌బాల్), మోహిత్‌రెడ్డి (బాల్ బ్యాడ్మింటన్), యాషిక (బాల్ బ్యాడ్మింటన్) ఎంపికయ్యారు. వీరు నవంబర్ 3వ తేదీ నుంచి కృష్ణా, ఒంగోలు ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పనులు వేగవంతం చేయండి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన శ్రీప్రసన్న వరదరాజ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఆదివారం వారు పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజు యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్నారు. ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నూకరత్నం, శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌కుమార్, సూర్యప్రసాద్, స్తపతికుమార్, కాంట్రాక్టర్లు యువకిషోర్, విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ముఖ్యంగా మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇంటి వద్దే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. దొరవారి సత్రంలో నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. వేలాది మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు పొందారు.

– దొరవారిసత్రం



పూలతోట గ్రామంలో వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వేల మందికి సేవలు
- డీవీ సత్రంలో విజయవంతంగా ముగిసిన శిబిరాలు

దొరవారిసత్రం, తొగరాముడి గ్రామాల్లోని పీహెచ్‌సీ పరిధిలోని 11 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా 8818 మంది వైద్య సేవలు పొందారు. డీవీ సత్రం మండలంలో కంటి ఆపరేషన్ల కోసం 50 మంది, న్యూరాలజీ సమస్యలు ఉన్న 150 మంది, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న 47 మందిని తిరుపతి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లోని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న మహిళలను శస్త్రచికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

నెల రోజుల ముందు నుంచే సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లు నెల రోజుల ముందు నుంచే ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. మండలంలో 12,624 గృహాలు ఉండగా 12,180 గృహాలను సందర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి రసీదుల అందజేసి వైద్య శిబిరాల్లో వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు.



ఉచ్చూరులోని ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు(ఫైల్)



వేణుంబాకలో జగనన్న సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

అన్ని పరీక్షలు చేశారు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బీపీ, షుగర్ వంటి పరీక్షలు అన్ని చేసి మందులు అందజేశారు. వైద్యులు కూడా ఎంతో ఓపికగా పరీక్షించి పలు విషయాలు తెలిపారు. సురక్ష కార్యక్రమంలో చాలా మందికి వరంగా మారింది.

- రామయ్య, ఉచ్చూరు

అద్దాలు ఇస్తామన్నారు



వైద్య శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపాన్ని గుర్తించారు. త్వరలోనే అద్దాలు అందజేస్తామని చెప్పారు. గ్రామాల్లోనే వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించి మాలాంటి పేదలకు జగనన్న చాలా మేలు చేశారు.

- ఆనందయ్య, మీజూరు

పేదలకు చాలా మేలు జరిగింది



పట్టణాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. న్యూరాలజీ, ఆర్థో, కంటి శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారు ఆరోగ్య శ్రీలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం.

- వి.చైతన్య, వైద్యాధికారి, డీవీ సత్రం పీహెచ్‌సీ

పక్కాగా వైద్య శిబిరాల నిర్వహణ



గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందేలా వైద్యులు కృషి చేశారు. వేలాది మంది వైద్య పరీక్షలు చేయించుకుని మందులు పొందారు.

- రఘురావయ్య, ఎంపీడీవో, డీవీ సత్రం

నేడు ఊటుకూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

సైదాపురం: మండలంలోని ఊటుకూరు సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు అంకులపాటూరులో సివిల్ రైట్స్ డే

చిల్లకూరు : మండలంలోని అంకులపాటూరు గ్రామంలో సోమవారం సాయంత్రం సివిల్ రైట్స్‌డే గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అవగాహన కల్పించడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

గుండెపోటుతో ఏఎన్‌ఎం మృతి

కోట: కోట దళితవాడకు చెందిన ఏఎన్‌ఎం దారా క్రిష్ణవేణి(42) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె వల్లిపేడు పీహెచ్‌సీ పరిధిలోని సిద్ధవరంలో పనిచేస్తున్నారు. క్రిష్ణవేణి మృతి కలచివేసిందని వైద్యులు, సిబ్బంది తెలిపారు. ఆమె మృతదేహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, మాజీ సర్పంచ్ రాఘవయ్య, ఎంపీటీసీ మొబీన్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సబ్సిడీపై పామోలిన్ మొక్కలు



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఆనందరెడ్డి

డక్కిలి: పామోలిన్ తోటలు పెంపొందించడంలో భాగంగా ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేస్తోందని వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనందరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తీర్థంపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పామోలిన్ తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ద్వారా అవగాహన కల్పించడంతోపాటు దిగుబడి వచ్చిన తర్వాత బై బ్యాగ్ తీసుకుంటామన్నారు. పామోలిన్ మొక్కలు ఎకరాకు 60 సరిపోతాయని, సాగులో ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయన్నారు. అదేవిధంగా రైతులకు మొదట ఏడాది రూ.29 వేలు, రెండు, మూడు, నాలుగు సంవత్సరాలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా ఆర్బీకేలో ఉద్యానవన శాఖ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు చేయడానికి వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్ మండలాలను ఉద్యాన శాఖ ఎంపిక చేసిందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కౌన్సిలర్‌కు నాయకుల పరామర్శ





నారాయణను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సర్వజ్ఞకుమార యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మలవత్తు ఆదినారాయణను ఆదివారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర పరామర్శించారు. ఆదినారాయణ సోదరి మలవతు అక్కయ్య ఈ నెల 21వ తేదీన మృతిచెందారు. పట్టణంలోని సాలికాలనీలో ఆదివారం ఉత్తర క్రియలు నిర్వహించారు. వారు ఇందులో పాల్గొని నారాయణ, అక్కయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అదేవిధంగా ఆదినారాయణను పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం



రాపూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రాపూరు: విజయవాడ ఆర్టీసీ డిపో డ్రైవర్‌పై దాడి అమానుషమని, దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాపూరు ఆర్టీసీ డిపో కార్మికులు తెలిపారు. వారు ఆదివారం డిపో గేట్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాత్రి, పగలూ ప్రజల కోసం విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులపై దౌర్జన్యం చేయడం తగదన్నారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు నరసయ్య, రమణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్ : నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ(ఈయూయు, ఎస్‌డబ్ల్యూఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. వారు ఆదివారం గూడూరులోని ఆర్టీసీ డిపో వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు నారాయణ, ఈయూ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, ఈవీ కుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడు రాము, గ్యారేజ్ కార్యదర్శి రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎన్‌ఎంయూఏ ఉమ్మడి జోనల్ చైర్మన్ జీఎస్.వాసులు ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డిపో సెక్రటరి ప్రవీణ్, అధ్యక్షుడు ఎస్.కె.బాషా, గౌస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గూడూరు రూరల్ : కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని, నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చి డ్రైవర్లకు భరోసా కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి సురేష్, గోపి, పెంచలప్రసాద్, చంద్రయ్య, బాలరాజు, త్రివేంద్ర, కేవీపీఎస్ పట్టణ నాయకుడు అడపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గూడూరులోని ఆర్టీసీ డిపో వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

కండలేరులో 11.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

గూడూరు రూరల్ : మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకన్నా ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కిషోర్ హెచ్చరించారు. ఆయన ఆదివారం గూడూరు పట్టణం, రూరల్ పరిధిలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. విందూరులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఎమ్మార్పీ కన్నా రూ.10 అదనంగా విక్రయిస్తుండడాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. సిబ్బంది కుమార్, శివ కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలకు బహుమతులు



నగదు, జ్ఞాపికలు అందుకున్న విజేతలు

ఏర్పేడు: కొత్తకాల్వ గ్రామంలోని కృషి బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అకాడమీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురునాథ హార్డ్ వేర్స్, జై డోర్స్ సంస్థ ఈ టోర్నమెంట్ నిర్వహించాయి. వివిధ ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతికి చెందిన శశిభూషణరావు, శరత్‌కుమార్, రన్నర్స్‌గా చక్రధర్‌రెడ్డి, మహమ్మద్ వసీం గెలుపొందారు. విజేతలకు నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రూపస్, లోకేష్, కేశవులు, కిరణ్ మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేద్దాం



టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వై నాట్ 175 అనే జగనన్న నినాదానికి అనుగుణంగా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరం సైనికుల్లా పని చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం వాకాడులో నిర్వహించిన వై నాట్ 175, వై ఏపీ నీడ్స్ జగన్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వాటిని ప్రతి ఇంటికీ వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆత్మ గౌరవంతో బతుకుతున్నారని వివరించారు. అలాగే మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత దక్కిందన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ఇద్దరు టీడీపీ కార్యకర్తలు

జగనన్న పరిపాలనకు ఆకర్షితులైన వాకాడు మండలం శ్రీపురం గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు టి.రామకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి, కొడవలూరు దామోదర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి





మాట్లాడుతున్న బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి , ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ

చిల్లకూరు : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, అవి మన దేశంలో ఎన్నటికి సమసి పోకుండా ఉండాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రామ దేవతలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇచ్ఛాపురంలోని నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి తెలిపారు. ఆయన ఆదివారం ముత్యాలమ్మ ఆలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దేవతా మహత్యం, జగన్మాత తత్వం, అనే అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ తమకు దగ్గరలో ఉన్న గ్రామ దేవతలను దర్శించుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ ఆనవాయితీని కొనసాగిస్తున్నారని, దీంతోనే సంస్కృతి, సంప్రదాయాలు నిలిచి ఉన్నాయని వివరించారు. అనంతరం ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రారెడ్డి, ఎంపీటీసీ ఎల్లసిరి జానకిరామ్, భారతీయ శిక్షణా మండలి సభ్యులు ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నరసింహస్వామి కల్యాణం



గ్రామానికి చేరుకున్న స్వామి వారి రథం



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం(వెంకటగిరి): స్థానిక ఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మదర్ అకాడమీ వద్ద ఆదివారం నరసింహస్వామి, ఆదిలక్ష్మి చెంచులక్ష్మి దేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార రథం ఆదివారం వెంకటగిరికి చేరుకుంది. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు ఆధ్వర్యంలో రథం వెంకటగిరిలోని వరదరాజా స్వామి, ఆంజనేయ స్వామి ఆలయం, పోలేరమ్మ, రాజావీధి, కాశీపేట, తహసీల్దార్ కార్యాలయం మీదుగా తూర్పువీధి, పాత బస్టాండ్, ఎస్ఆర్ కల్యాణ మండపం వరకు సాగింది. పోలేరమ్మ ఆర్చి వద్దకు చేరుకున్న స్వామి వారి రథాన్ని వెంకటగిరి రాజా వారసులు స్వర్ణజ్ఞ కుమార యాచేంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మదర్ అకాడమీ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, విప్ లక్ష్మి, కౌన్సిలర్లు కల్యాణి, చంద్రారెడ్డి, ఈవో జనార్దన్‌రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పులిమి ప్రసాద్‌రెడ్డి, పెంచలకోన ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్య స్వామి అర్చకులు మల్లికార్జున స్వామి, శశిస్వామి, వినోద్‌స్వామి, సూర్యస్వామి, ప్రసాద్‌స్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన భక్తులు